సాక్షి నంద్యాల

గురువారం । 18 । జూలై । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నదాన పథకానికి విజయవాడ ఎన్‌వీఎస్‌ఎల్ కిరణ్ దంపతులు, కర్ణాటక రాష్ట్రం కోప్పల్‌కు చెందిన ఇ.శరణ బసవరాజ్ దంపతులు రూ. లక్ష చొప్పున విరాళమిచ్చారు.



'కుష్టు' నివారణే లక్ష్యంగా..

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఈ నెల 18 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ఇందుకు వైద్య బృందాలు సిద్ధంగా ఉన్నాయి. 8లో▸



'ఆయిల్‌పామ్'వైపు అడుగులు

అన్నదాతలు అయిల్‌పామ్ సాగు వైపు అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15 నుంచి సెప్టెంబరు 15 వరకు మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించనున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రజలే నేరుగా ఫిర్యాదు చేయొచ్చు

● ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా



బొమ్మలసత్రం: జిల్లా ప్రజలు తనకు నేరుగా ఫిర్యాదులు చేయాలంటే 9154987020 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా తెలిపారు. సెంట్రల్ కంప్లైంట్ సెల్, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించిన ఫిర్యాదుల గురించి ఫోన్ చేయొచ్చన్నారు. శాంతిభద్రతల సమాచారం తెలిపేందుకు కూడా తనతో నేరుగా మాట్లాడవచ్చన్నారు. ఆన్‌లైన్ మోసాలు, ఉద్యోగాల పేరుతో మోసాలకు, బిట్ కాయిన్స్ మోసాలు, లోన్‌యాప్ మోసాల బారినపడిన వారు 1930, 9154987034 నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు.

సంగమేశ్వరం వద్ద తగ్గిన శ్రీశైలం జలాలు



తగ్గిన నీరు

కొత్తపల్లి: సప్తనది సంగమేశ్వరం సమీపంలో శ్రీశైలం జలాశయం వెనుక జలాలు(బ్యాక్‌వాటర్) తగ్గుముఖం పట్టాయి. శ్రీశైలంలో కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తుండడంతో జలాశయంలో నీటి మట్టం తగ్గుముఖం పట్టింది. దీంతో బుధవారం సప్తనది సంగమ ప్రాంతంలో భీమలింగం ప్రాంతం బయల్పడింది.

టైపు రైటింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

డోన్ టౌన్: ఈ ఏడాది సెప్టెంబరు 28, 29 తేదీల్లో ఏపీ స్టేట్ బోర్డు నిర్వహించే టైపు రైటింగ్ పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ టైప్ ఇన్‌స్టిట్యూట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీరాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీషు, తెలుగు భాషల్లో లోయర్, హయ్యర్ గ్రేడ్, హైస్పీడ్ పరీక్షలను, ఇంగ్లీషు జూనియర్ గ్రేడ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా సెప్టెంబర్ 21, 22 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా షార్ట్ హ్యాండ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు స్థానికంగా ఉన్న టైప్ ఇన్‌స్టిట్యూట్లలో సకాలంలో ఫీజు చెల్లించి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు.

సాగర్‌కు 30,680 క్యూసెక్కుల నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు మంగళవారం నుంచి బుధవారం వరకు 30,680 క్యూసెక్కుల నీటిని కుడి, ఎడమగట్టు కేంద్రాలలో విద్యుత్ ఉత్పాదన ద్వారా విడుదల చేశారు. కృష్ణానది యాజమాన్య బోర్డు ఆదేశాల మేరకు 5.7 టీఎంసీల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. అలాగే కల్వకుర్తి ఎత్తిపోతలకు 166 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బుధవారం సాయంత్రం నాటికి డ్యాంలో 33.2488 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నీటి మట్టం 808.20 అడుగులకు చేరుకుంది.

ఆర్‌టీఏ అధికారుల విస్తృత తనిఖీలు

● 17 వాహనాలపై కేసులు నమోదు
● రూ.4.23 లక్షల జరిమానా



వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణాశాఖాధికారులు

నంద్యాల (న్యూటౌన్): జిల్లావ్యాప్తంగా వాహనాల తనిఖీ చేపట్టినట్లు డీటీసీ శివారెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి, బుధవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా రోడ్లమీదకు వచ్చిన 17 వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు. అందులో రెండు కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులు, అధిక లోడ్‌తో వెళ్తున్న 11 గూడ్స్‌వాహనాలు, ఒక మ్యాక్సీ క్యాబ్, మూడు ఇతర వాహనాలు ఉన్నాయన్నారు. వీటికి రూ.4.23 లక్షల జరిమానా విధించామన్నారు. తనిఖీల్లో నంద్యాల, డోన్, ఆత్మకూరు రవాణాశాఖ అధికారులు రవిశంకర్, సుబ్బయ్య, ప్రదీప్‌రెడ్డి, నాగేంద్ర, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పెడతోవన పిల్లలు.. తోడైన తల్లిదండ్రులు!



➡ ముచ్చుమర్రిలో తొమ్మిదేళ్ల బాలికపై ముగ్గురు మైనర్ బాలురు ఈ నెల 7న అత్యాచారానికి పాల్పడ్డారు. ఆపై హత్య చేశారు. పిల్లల్ని మందలించాల్సిన తల్లిదండ్రులు శవం ఆచూకీ కూడా దొరకకుండా మాయం చేశారు. ఐదో తరగతి బాలికను 6, 10 తరగతులు చదివే ముగ్గురు అత్యాచారం చేసి హత్య చేశారంటే ఆ పిల్లల మనస్తత్వం, తల్లిదండ్రుల పెంపకం ఇట్టే అర్థమవుతోంది.

➡ ఆలూరు మండలం పెద్ద హోతూరులో ఓ మైనర్ బాలికను సురేశ్ అనే యువకుడు అత్యాచారం చేశాడు. అతడి ఘాతుకాన్ని భయపడుతూనే బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో గత నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంత భయంకర ఘటనపై పోలీసులు స్పందించిన తీరు కూడా దారుణం. తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తే ఆరు రోజుల తర్వాత పోక్సో కేసు నమోదైంది.

ఈ రెండూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో జరిగిన ఘటనలే కావడం గమనార్హం.

కలకలం సృష్టించిన 'ముచ్చుమర్రి' ఘటన

● టీడీపీ అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే రెండు అత్యాచారాలు
● కనీసం బాలిక ఆచూకీ గుర్తించలేకపోయిన పోలీసులు
● చట్టం శిక్షిస్తుందనే భయం కూడా కరువు
● మితిమీరిన ప్రేమతో బరితెగిస్తున్న పిల్లలు
● పాఠశాలల్లో కనిపించని మంచీచెడుల బోధన



సాక్షి ప్రతినిధి, కర్నూలు: గత నెల రోజుల టీడీపీ ప్రభుత్వ పాలన నిశితంగా పరిశీలిస్తే శాంతిభద్రతలపై పోలీసులు పూర్తిగా పట్టు కోల్పోయారని స్పష్టమవుతోంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఈ నెల రోజుల్లో ప్రతిపక్షపార్టీ నేతలు, కార్యకర్తలపై దాడులు, విగ్రహాల ధ్వంసాలు, ప్రభుత్వ, ప్రవేటు ఆస్తుల విధ్వంసం ఘటనలు కనీసం 50 వరకు చోటు చేసుకున్నాయి. దీన్ని బట్టి చూస్తే 'నేరాలు, దాడులు చేస్తే పోలీసులు ఉన్నారు, శిక్షిస్తార'నే కనీస భయం కూడా లోపిస్తోంది. ముఖ్యంగా మైనర్ బాలికలపై అత్యాచారాలు ప్రభుత్వ, పోలీసు వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. మైనర్ బాలికపై ముగ్గురు బాలురు అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. అయితే 11 రోజులు గడిచినా బాలిక ఆచూకీని కూడా పోలీసులు గుర్తించలేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ ఒక్క ఘటనతో నేరస్తులు ఎంత కర్కోటకంగా ఉన్నారో, పోలీసులు ఎంత నిస్సహాయులుగా మారిపోయారో స్పష్టమవుతోంది. తప్పు చేస్తే కఠిన శిక్ష పడుతుందనే భయం కూడా కరువైందనేందుకు ఈ ఘటనే నిదర్శనం. నిందితులు అధికార పార్టీ నేతలను ఆశ్రయిస్తే నేరం తీవ్రత తగ్గిపోవడంతో పాటు మొక్కుబడి చర్యలతో మమ అనిపించారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మొత్తంగా గత నెల రోజుల్లో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. పోలీసులు కూడా అధికార పార్టీ ప్రజాప్రతినిధులను కాదని స్వేచ్ఛగా విధులు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. అధికార పార్టీ చెప్పుచేతల్లో లేకపోతే కోరుకున్న పోస్టింగ్‌లు ఉండవని కొందరు మనసొప్పకపోయినా తలూపుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ కారణంగానే తీవ్రమైన నేరాలు చోటు చేసుకున్నా అంతే స్థాయిలో పోలీసులు స్పందించలేకపోతున్నట్లు చర్చ జరుగుతోంది.

పాఠశాలల్లో విద్యాబోధన కారణమే..

కార్పొరేట్, ప్రైవేటు విద్యావ్యవస్థలో పిల్లలకు పుస్తకాల్లో ఉన్న అంశాలు బట్టీ కొట్టించడం మినహా వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా చేయడం లేదు. మంచి మార్కులు, ర్యాంకులు తెచ్చే యంత్రాలుగా మాత్రమే టీచర్లు చూస్తున్నారు. మంచి వ్యక్తిత్వం, విలువలు బోధించేలా విద్యాబోధన ఉండటం లేదు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా జీవితాన్ని నెట్టుకురాగలిగే స్థైర్యాన్ని నింపడంలో విఫలమవుతున్నారు. పాతికేళ్ల కిందటి విద్యావ్యవస్థలో గురువులు పాఠాల కంటే నీతి కథలతో పాటు మంచి, చెడులు చెప్పేవారు. అందుకే అప్పట్లో ఇలాంటి ఘటనలు అతి తక్కువ.

పోర్న్‌సైట్లపై కొరవడిన నియంత్రణ

తల్లిదండ్రులు పిల్లలకు సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లు ఇస్తున్నారు. వీటిలో పిల్లలు ఎక్కువగా పోర్న్‌సైట్లలో నీలి వీడియోలు చూస్తున్నారు. చిన్న వయస్సులో ఇలాంటివి చూడటంతోనే ఒంటరిగా బాలికలు, అమ్మాయిలు కన్పిస్తే అత్యాచారానికి తెగిస్తున్నారు. ముచ్చుమర్రిలో 6, 10 తరగతి విద్యార్థులకు తొమ్మిదేళ్ల బాలికను అత్యాచారం చేయాలనే ఆలోచన వచ్చిందంటే వారిలో కామవాంఛలకు దారితీసిన పరిస్థితులు ఇట్టే తెలుస్తున్నాయి. పైగా బాలికను చంపేశారంటే ఆ వయస్సులోనే క్రూరత్వం ఏ స్థాయిలో వేళ్లూనుకుందో తెలుస్తోంది. వీరి నేరానికి తల్లిదండ్రులు సహకరించడం చూస్తే భవిష్యత్తులో ఇతర పిల్లలు కూడా నేరం చేస్తే తల్లిదండ్రులు అండగా నిలుస్తారనే సంకేతాన్ని బాహాటంగానే పంపినట్లయింది. ఈ భావన పోవాలంటే ముచ్చుమర్రి ఘటనలో పిల్లలతో పాటు తల్లిదండ్రులను శిక్షించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తల్లిదండ్రుల పెంపకం, సొసైటీ తీరు కూడా కారణమే!

ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాల సంఖ్య తగ్గిపోయింది. అపార్ట్‌మెంట్ కల్చర్, పట్టణీకరణ పెరిగిన తర్వాత భార్య, భర్త, వారి పిల్లలే ఓ కుటుంబంగా ఉన్నారు. పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు బిజీగా ఉంటున్నారు. కనీసం పిల్లలతో స్వేచ్ఛగా ఓ గంట గడపలేని పరిస్థితి. మంచి, చెడు, కష్టం, సుఖం తేడా చెప్పలేని పరిస్థితి. ఇలాంటి యాంత్రిక జీవనంలో పిల్లలు సెల్‌ఫోన్‌లకు బందీ అవుతున్నారు. షార్ట్స్, అసభ్యకర వీడియోలు చూస్తూ చిన్న వయస్సు నుంచే విచక్షణ కోల్పోతున్నారు. 'తాము ఎన్నో కష్టాలు పడ్డాం! మా పిల్లలు కష్టపడకూడదు. సుఖంగా ఉండాలి' అనే భావన తల్లిదండ్రుల్లో ఉంది. ఈ భావనే పిల్లలకు కష్టాలను తెచ్చి పెడుతోంది. తమ పిల్లలు తమ ముందు మంచిగా ఉన్నారనే అపోహ మినహా ఇళ్లు దాటితే ఎలా ఉంటున్నారనే అవగాహన ఉండని పరిస్థితి. ఏదైనా ఘటన జరిగితే అప్పుడు కోలుకోని దెబ్బ తగిలి అల్లాడిపోతున్నారు. మానసికంగా పిల్లలను దృఢంగా పెంచడంలో అధికశాతం తల్లిదండ్రులు విఫలమవుతున్నారు.

ఇదీ 'కార్పొరేట్' చదువు

కర్నూలులోని ఓ కార్పొరేట్ పాఠశాలలో విద్యార్థినిపై టీచర్ చేయి చేసుకుంటే, తిరిగి విద్యార్థి టీచర్‌ను దారుణంగా కొట్టారు. దీంతో టీచర్ విద్యార్థిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కొట్టిన విద్యార్థి టీడీపీ నేత కుమారుడు కావడంతో ఓ టీడీపీ నాయకుడు కేసు రాజీ చేయాలని పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. దీన్నిబట్టి చూస్తే ఎంతటి ఘోరమైన పరిస్థితులు ఉన్నాయో ఇట్టే తెలుస్తోంది.

తండ్రిలాంటి వ్యక్తుల తప్పటడుగులు

నగర శివారులోని ఓ కార్పొరేట్ కళాశాలలో తండ్రిలా విద్యార్థుల బాగోగులను చూడాల్సిన నిర్వాహకుడు బరితెగించి కళాశాలలోనే కామకలాపాలకు పాల్పడటం తెలిసిందే. ఈ బాగోతాన్ని కిందిస్థాయి ఉద్యోగులే సీక్రెట్ కెమెరాల్లో బంధించి బ్లాక్‌మెయిల్ చేయడం, ఆ తర్వాత రాజీ ప్రయత్నాలతో ఆ 'మగాను భావుడు' తప్పించుకున్నా.. ఇలాంటి పరిణామం అక్కడి విద్యార్థుల జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చెప్పక్కర్లేదు.

విద్యాసంస్థలు, తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలి



విద్యావ్యవస్థలో లోపం ఉంది. మార్కులు, ర్యాంకులు తప్ప విలువలు పెంచేలా బోధన ఉండటం లేదు. ఈ కారణంగానే ఏది తప్పు, ఏది ఒప్పు అనే అవగాహన పిల్లల్లో కొరవడుతోంది. మొబైల్, ఇంటర్నెట్ ద్వారా చెడు నేర్చుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పోర్న్, ఇతర సైట్‌లు, యాప్‌లపై 'పేరెంటల్ కంట్రోల్' ఉండాలి. పిల్లల చదువుపై మినహా విలువలు, వ్యక్తిత్వం పెంచడంపై తల్లిదండ్రులు కూడా దృష్టి పెట్టడం లేదు. ఒక మొక్కను పెంచడంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో పిల్లల విషయంలోనూ అలాంటి శ్రద్ధ కనపర్చాలి.

– డాక్టర్ నాగేశ్వరరావు, హెచ్‌ఓడీ, మానసిక వ్యాధుల విభాగం, కర్నూలు జనరల్ ఆస్పత్రి



బనగానపల్లెలో మాతం నిర్వహిస్తున్న షియా మతస్తులు

భక్తిభావం.. రక్తార్పణం



మాతంలో పాల్గొన్న బనగానపల్లె నవాబు వంశీయులు మీర్‌ఫజలే అలీఖాన్

బనగానపల్లె: అసువులు బాసిన హసేన్, హుసేన్‌లకు షియా మతస్తులు రక్తార్పణం చేశారు. ఏళ్లుగా వస్తున్న ఈ ఆచారం ప్రకారం బుధవారం బనగానపల్లెలో మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పట్టణంలోని పీర్లను జుర్రేవు వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. బనగానపల్లె నవాబు కోట నుంచి నవాబు మీర్ ఫజలే అలీఖాన్, ఆయన కుమారుడు గులాం అలీఖాన్ వెంట నడవగా షియా పెద్దలు, షియా మతస్తులు నల్లటి వస్త్రాలు ధరించి పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు. శోకగీతాలు ఆలపిస్తూ బ్లేడ్లు, చురకత్తులతో యద, వీపు భాగంలో మాతం నిర్వహిస్తూ తమ రక్తన్ని చిందించి భక్తిభావం చాటుకున్నారు. కొండపేట ఇమాంఖాసీం పీరు.. జుర్రేరు వద్దకు చేరుకున్న పీర్లను ఆలింగనం చేసుకుంది. సుమారు 250 పీర్లను జుర్రేరులో శుద్ధి చేసి అనంతరం తిరిగి చావిళ్లకు చేర్చారు. నవాబుకోటలోను, పాతబస్టాండ్‌లోను వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, బనగానపల్లె సీఐలు గంటా సుబ్బారావు, తిమ్మారెడ్డి బందోబస్తు నిర్వహించారు. రాత్రి సంతాప సూచికంగా వ్యాపార దుకాణాలు, సినిమా హాల్స్ మూసివేయగా, వీధిలైట్లను ఆర్పివేశారు. మాతం తిలకించేందుకు హిందూ ముస్లింలు వేలాదిగా తరలివచ్చారు.

శుభకార్యాలకు బ్రేక్!

● ఆషాడమాసం ప్రారంభం
● పుట్టింటికి చేరుకున్న కొత్త కోడళ్లు



గోస్పాడు: ఆషాడ మాసం ప్రారంభంతో శుభకార్యాలకు బ్రేక్ పడనుంది. ఈ మాసంలో వర్షాలు కురుస్తాయని, వ్యాధులు ప్రబలుతాయనే ఉద్దేశంతో ఎలాంటి శుభకార్యాలు తలపెట్టరు. వివాహాలు, నిశ్చితార్థాలు, గృహ ప్రవేశాలు వాయిదా వేసుకుంటారు. అయితే ఈ మాసంలో ఎలాంటి శుభకార్యాలు తలపెట్టకున్నా అనేక విశిష్టతలు ఉన్నాయి. కొత్తగా పెళ్లయిన వధువులు పుట్టింటికి చేరుకుంటారు. కొత్త అల్లుళ్లను అత్తవారింట అడుగు పెట్టనివ్వరు. పూర్వాషాడ నక్షత్రంలో పౌర్ణమి ఉన్న నెలయే ఆషాడ మాసం. పౌర్ణమి రోజున చంద్రుడు ఉత్తరాషాడ, పూర్వాషాడ నక్షత్రాల మధ్యలో ఉండడం వల్ల వచ్చే నెల ఇది. ఉత్తరాయణ పుణ్యకాలం పూర్తయి సూర్యుడు మిధునరాశి నుంచి కర్కాటకరాశిలోకి ప్రవేశించడంతో దక్షిణాయణం ప్రారంభమవుతుంది. దీన్ని శూన్య మాసంగా వ్యవహరించినప్పటికీ ఈ మాసంలో వచ్చే తొలి ఏకాదశితోనే పండగలు ప్రారంభమవుతాయి. దేవతారాధనలు, శక్తి ఆరాధనలు ఎక్కువగా చేస్తారు.

గోరింట మెరుపులు..

ఆషాడ మాసంలో మహిళలు గోరింటాకు ధరించడం ఆనవాయితీ. గ్రీష్మరుతువు అనంతరం వర్ష రుతువులో ఆషాడం వస్తుంది. ఈ సమయంలో గ్రీష్మరుతువులో మన శరీరం వేడితో కూడుకుని ఉంటుంది. ఆషాడంలో బయటి వాతావరణం చల్లబడుతుంది. ఈ కారణంగా గోరింటను అరచేతుల్లో ధరిస్తే శరీరం చల్లబడుతుంది. చర్మ సమస్యలు కూడా దరిచేరవు. రోగ నిరోధక శక్తిని సైతం పెంచుతుంది.

ఒకరినొకరు చూసుకోకూడదని..

కొత్తగా పెళ్లయిన వధువులు ఆషాడంలో అత్తారింటి నుంచి పుట్టింటికి వెళ్తారు. ఆషాడంలో అత్తాకోడళ్లు ఒకరినొకరు చూసుకోకూడదనే సంప్రదాయం అనాదిగా వస్తోంది. దీంతో కొత్తగా పెళ్లయి అత్తారింట్లో అడుగిడిన అమ్మాయిలు తల్లిదండ్రుల పుట్టినిళ్లకు వెళ్తారు. అక్కడ తోబుట్టువులు, స్నేహితురాళ్లతో కలిసి వేడుకలు జరుపుకుంటారు.

పర్వదినాలు ప్రారంభం..

ఆషాడం పదం 'ఆది' అనే సంస్కృత పదం నుంచి పుట్టింది. ఆది అంటే శక్తి అనే అర్థం. ఆషాడంలో దేవతలను పూజించడం పవిత్ర కార్యమని భక్తుల నమ్మకం. అందుకే ఈ నెలలో ఆలయాలు భక్తులతో రద్దీగా ఉంటాయి. తొలి ఏకాదశి నుంచి పండగలు మొదలవుతాయి. ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున మహా విష్ణువు పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలి ఏకాదశిగా వ్యవహరిస్తారని, ఆషాడ శుద్ధపౌర్ణమి రోజున గురుపౌర్ణమిగా పరిగణిస్తారని పురోహితులు చెబుతున్నారు.

ఈ సంప్రదాయం అనాదిగా వస్తుంది



కొత్తగా పెళ్లయిన వధువులు ఆషాడమాసంలో అత్తగారింటి నుంచి పుట్టినింటికి రావడం అనాదిగా వస్తున్న సంప్రదాయమే. ఏడాదిలోపు పెళ్లిళ్లు అయిన వధూవరులు ఎవరికి వారు ఉంటారు. ఆషాడ మాసం ఆధ్యాత్మికతకు నెలవు. ఈమాసంలోనే ప్రత్యేక పర్వదినాలు ప్రారంభమవుతాయి. తొలిఏకాదశి పర్వదినంతోనే పండుగలు ప్రారంభమవుతాయి. ఆషాడం వచ్చేనెల 5వతేదీతో ముగియనుంది.

– సుధీంద్రాచార్యులు, అఖిల భారత బ్రాహ్మణ మహాసంఘం జిల్లా అధ్యక్షులు

ప్రహ్లాదవరదా..పాహిమాం!

● శాస్త్రోక్తంగా తొలి ఏకాదశి పూజలు



ప్రత్యేకాలంకరణలో కొలువైన ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మూలమూర్తులను శుప్రభాతసేవతో మేలుకొల్పారు. దివ్యదర్శనం అనంతరం నిత్యపూజలు, ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వాములను ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య దూపదీపాలతో మహా మంగళ హారతి అందించారు. రాత్రి విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు పల్లకీపై కొలువుదీరి తిరువీధిలో విహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి స్వామి వారి ఆశీర్వచనాలు అందజేశారు.

బాలిక ఆచూకీ కనిపెట్టడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

పగిడ్యాల: బాలిక అదృశ్యమై 11 రోజులవుతున్నా ఆచూకీ కనిపెట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని చెందిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా విమర్శించారు. బుధవారం మండలంలోని కొత్త ఎల్లాలకు చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లా అండ్ ఆర్డర్ సమస్య అధికమైందన్నారు. ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్ల బాలిక ఆడుకోవడానికి ఈనెల 7న వెళ్లి అదృశ్యమైతే ఇప్పటి వరకు ఆచూకీ తెలుసుకోలేకపోవడం సిగ్గుచేటన్నారు. బాలిక తల్లిదండ్రులు అనుభవిస్తున్న కడుపు కోత వర్ణనాతీతమన్నారు. ప్రభుత్వం తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి సీఐ, ఎస్‌ఐలను సస్పెండ్ చేయడం విచారకరమన్నారు. నేరానికి పాల్పడిన ముగ్గురు మైనర్లను, ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ప్రకటించి చేతులు దులుపుకున్నారని, బాలిక మృతదేహం ఆచూకీ ఎన్ని రోజులకు కనిపెడతారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆధునిక పరికరాలను ఉపయోగించి మృతదేహం ఆనవాళ్లు కనిపెట్టాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం శోచనీయమన్నారు. కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మురళి, నాగసేనారెడ్డి, రాజు, కురుమన్న ఉన్నారు.

భక్తుల సౌకర్యాలపై దృష్టి

● శ్రీశైల ఆలయ ఈఓ డి.పెద్దిరాజు



క్షేత్ర పరిసరాలను పరిశీలిస్తున్న మాస్టర్ ప్లాన్ నిపుణులు, ఈఓ, ఈఈ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో రాబోయే 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకుని భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు తెలిపారు. బుధవారం మాస్టర్ ప్లాన్ పరిశీలనలో భాగంగా ఇంజినీరింగ్ అధికారులు, మాస్టర్ ప్లాన్ నిపుణులతో కలిసి ఈఓ క్షేత్రంలోని వివిధ ప్రదేశాలను పరిశీలించారు. ఔటర్ రింగ్‌రోడ్డు, పార్కింగ్ ప్రదేశాలు, రహదారి డివైడర్లు, తాగునీటి ప్లాంట్లు, పాత పుష్కరిణి, పలు ఉద్యానవనాలు, పాతాళగంగ వద్ద ఏర్పాట్లు, నూతన క్యూలైన్ల ఏర్పాటు, లడ్డూ ప్రసాదాల తయారీ కేంద్రం, నీటి సరఫరా, ఫిల్టర్‌బెడ్లు, ఆలయ మాడవీధుల సమీపంలో కళావేదిక నిర్మాణం, శివసేవకుల వసతి విభాగం మొదలైన ప్రదేశాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. క్షేత్రపరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ దృఢమైన కంచె ఏర్పాటు చేయాలని, ఎగుడు దిగుడుగా ఉన్న పెద్దసత్రం ముందుభాగాన్ని చదును చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట మాస్టర్ ప్లాన్ నిపుణులు కేఎస్‌వీవీ ప్రసాద్, రాజేంద్ర, ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ శశిధర్, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వి.రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి, డీఈఈ చంద్రశేఖరశాస్త్రి, ఏఈలు ఉన్నారు.

క్లుప్తంగా

పోలీసులు కొట్టారని యువకుడి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న రవి

కోసిగి: మండల పరిధిలోని పెద్దభూంపల్లి గ్రామానికి చెందిన రవి అనే యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. రవి బెంగళూరులో ఉంటూ ఎలక్ట్రానిక్ వర్క్ చేసి జీవనం సాగిస్తున్నాడు. మొహర్రం పండుగ కోసం 4 రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. అయితే మంగళవారం రాత్రి గ్రామంలో పీర్ల చావిడి వద్ద అలాయి బలాయి వేస్తుండగా పోలీసులు బూతులు తిట్టి కొట్టినట్లు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురై బుధవారం ఉదయం పొలానికి వెళ్లి పురుగు మందు తాగడంతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా గ్రామంలో పీర్ల చావిడి వద్ద అల్లర్లు జరుగుకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తుండగా రవి ఇతరులతో గొడవ పడుతుండగా మందలించి పంపిచారని, ఎవరు కొట్టలేదని చెప్పారు.

యువకుడి దుర్మరణం


పవన్‌కుమార్(ఫైల్)

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల-గుంజలపాడు ఆర్ అండ్‌బీ రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ వరప్రసాద్ తెలిపిన వివరాలు... పట్టణానికి చెందిన హరికుమార్, లక్ష్మిదేవి దంపతులకు ముగ్గురు కుమారులు. భర్త హరికుమార్ గతంలోనే మృతిచెందంతో కుమారులు గాంధీసెంటర్‌లో చిన్నపాటి హోటల్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండో కుమారుడు పవన్‌కుమార్(23) ఉదయం సొంత పనుల నిమిత్తం బైక్‌పై గుంజలపాడుకు వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా పట్టణ శివారులోని ఎస్సార్‌సీబీ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయుల ఔదార్యం

- డయాలసిస్ రోగికి రూ. లక్ష సాయం

కర్నూలు (టౌన్): కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు ఔదార్యం చూపారు. నంద్యాల జిల్లా కరివేన జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న గ్లోరి దయామణి భర్త డయాలసిస్‌తో బాధపడుతూ కర్నూలు ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల పిలుపుతో వ్యాయామ ఉపాధ్యాయులు స్పందించారు. మొత్తం రూ. లక్ష సేకరించారు. బుధవారం సంఘం నాయకులు కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితున్ని పరామర్శించి, రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు జోసఫ్ లక్ష్మయ్య, ప్రభాకర్, నాయకులు దండు నాయక్, రవికుమార్, శ్రీనివాసులు, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

‘ఆయిల్‌పామ్’వైపు అడుగులు

- నూతన పంటను సాగు చేసేందుకు ఉత్సాహం చూపుతున్న రైతులు
- ఈ ఏడాది 13 మండలాల్లో సాగుకు అనుమతి
- 300 హెక్టార్లకు రాయితీలు ఇచ్చేందుకు చర్యలు
- మూడు కంపెనీలతో కుదిరిన ఒప్పందం
- సెప్టెంబరు 15 వరకు మెగా ప్లాంటేషన్ డ్రైవ్


సి.బెళగల్ మండలం బురాన్‌దొడ్డి గ్రామంలో ఆయిల్‌పామ్ సాగు దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): నూతన పంటల సాగుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. పెట్టుబడి తక్కువ, దిగుబడి ఎక్కువ వచ్చే అయిల్‌పామ్ వైపు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే సి. బెళగల్ మండలంలో ఈ పంట సాగవుతోంది. ప్రభుత్వం కూడా రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి ఈ నెల 15 నుంచి సెప్టెంబరు 15 వరకు మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహిస్తుండటం విశేషం. రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రాయితీలు ఇలా..

రాయలసీమ జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు 2019లో అప్పటి వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ టీమ్ సీమ జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి సాగుకు అవకాశం ఉందని నివేదిక ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రయోగాత్మకంగా గతేడాది ఉద్యాన శాఖ, పతంజలీ ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సి.బెళగల్ మండలం బురాన్‌దొడ్డి గ్రామంలో ఆయిల్ పామ్ సాగు చేపట్టారు. ఈ ఏడాది జిల్లాలో 300 హెక్టార్లలో సాగు చేసే విధంగా ప్రభుత్వం జిల్లాకు కార్యాచరణ ప్రణాళికను ఇచ్చింది. ఆయిల్‌పామ్‌లో దేశవాళీ రకాల సాగుకు హెక్టారుకు రూ.20 వేలు, ఇంపోర్టెడ్ రకాల సాగుకు రూ.29 వేలు సబ్సిడీ నేషనల్ మిషన్ ఆన్ ఆయిల్‌సీడ్స్ అండ్ ఆయిల్‌పామ్ (ఎన్ఎంవోవోపీ) ఇవ్వనుంది.

నాలుగేళ్ల వరకు అంతర పంటలు

ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులను జిల్లాకు కేటాయించిన కంపెనీలే ఎంపిక చేస్తున్నాయి. నాలుగో ఏడాది నుంచి మొదలై.. ముప్పై ఏళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఉత్పత్తి ఆయిల్‌సీడ్స్‌ను ఆయా కంపెనీలే కొనుగోలు చేస్తాయి. హెక్టారుకు 143 మొక్కలు నాటుకోవచ్చు. మోతాదు మేరకు రసాయన ఎరువులతో పాటు....వీటికి అదనంగా సిఫార్సు చేసిన ప్రకారం సూక్ష్మ పోషకాలు వాడాలి. నాలుగేళ్ల వరకు అంతరపంటలు సాగు చేసుకోవచ్చు. పామాయిల్ తోటలున్న ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా పచ్చదనం ద్వారా వాతావరణ మార్పులను అరికట్టవచ్చు.

13 మండలాల్లో సాగుకు అనుమతి

ఆయిల్‌పామ్ సాగుకు నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. గాలిలో తేమ శాతం కూడా ఎక్కువగా ఉండాలి. వరి సాగు ఉన్న అన్ని ప్రాంతాల్లో ఈ పంటను సాగు చేయవచ్చు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు 13 మండలాలను ఎంపిక చేశారు. సాగుపై అవగాహన, మొక్కలు సరఫరా.. సస్యరక్షణ చర్యలపై అవగాహన పెంచేందుకు, మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు మూడు ఆయిల్‌పామ్ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. పతంజలీ ఫుడ్ లిమిటెడ్‌కు సి.బెళగల్, గోనెగండ్ల, నవభారత్ లిమిటెడ్‌కు ఆదోని, కృష్ణగిరి, కర్నూలు, ఎమ్మిగనూరు, లివింగ్ ఫుడ్స్‌కు హాలహర్వి, హొళగొంద, కోసిగి, కౌతాళం, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు మండలాలు కేటాయించారు.

అవగాహన కల్పిస్తాం



పామాయిల్ సాగులో పెట్టుబడి ఖర్చు తక్కువగా ఉంటుంది. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండటంతో రైతుకు భారం తగ్గుతుంది. ఇది శాశ్వత పంట.. రైతుకు నికరాదాయం వస్తుంది. సాగుకు ఏఏ నేలలు అనుకూలం, నీటి సదుపాయం ఎలా ఉండాలి, ఎకరాకు ఎన్ని మొక్కలు నాటు కోవాలి, దిగుబడి ఎప్పటి నుంచి మొదలవుతుంది, మార్కెటింగ్ సదుపాయం.. తదితర విషయాలపై సెప్టెంబరు 15 వరకు రైతులకు అవగాహన కల్పించనున్నాం. నాలుగేళ్లలో మెయిన్‌టెనెన్స్ కింద ప్రభుత్వం హెక్టారుకు రూ.20 వేల నుంచి 29 వరకు సబ్సిడీ ఇస్తుందన్న విషయాన్ని రైతుల దృష్టికి తీసుకెళ్లనున్నాం.

– పి. రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

ఆరు ఎకరాల్లో సాగు చేస్తున్నా



మేం గతంలో పత్తి సాగు చేసేవాళ్లం. కలసి రాక పోతుండటంతో సరికొత్తగా ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపాం. ఈ ఏడాది మార్చిలో ఆరు ఎకరాల్లో 360 మొక్కలు నాటాం. మొక్కలను పతంజలి ఫుడ్ కంపెనీనే ఉచితంగా సరఫరా చేసింది. ట్రాన్స్‌పోర్టు చార్జీలు మాత్రం మేం భరించాం. మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతున్నాయి. మొక్కలు నాటిన తర్వాత డ్రిప్ సదుపాయం కూడా కల్పించుకున్నాం. ఇప్పటి వరకు మొక్కల ట్రాన్స్‌పోర్టు చార్జీలు మినహా పెట్టుబడి వ్యయం లేదు. నాలుగేళ్లకు దిగుబడి మొదలవుతుందని చెబుతున్నారు. 7వ ఏడాది నుంచి దిగుబడి పెరిగే అవకాశం ఉంది. పంట దిగుబడులను పతంజలి ఫుడ్స్ కంపెనీనే మార్కెట్ ధరకు అనుగుణంగా కొనుగోలు చేస్తుంది.

–రాజశేఖర్‌రెడ్డి, బురాన్‌దొడ్డి, సి.బెళగల్ మండలం

నల్లమల ఘాట్‌రోడ్డులో నిలిచిన రాకపోకలు


ఘాట్‌లోని పురాతన వంతెనను ఢీకొన్న లారీ

మహానంది: గాజులపల్లె, గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో పాత రైల్వే వంతెన వద్ద ఓ లారీ గోడను ఢీ కొట్టింది. సాంకేతిక లోపం తలెత్తడంతో లారీ ఎటూ వెళ్లలేని పరిస్థితిలో రోడ్డుపైనే ఆగిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. సుమారు మూడు గంటలకు పైగా వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అటు ప్రకాశం జిల్లా దిగువమెట్ట వద్ద, ఇటు నంద్యాల జిల్లా గాజులపల్లె వద్ద వాహనాలను నిలుపుకున్నారు. రోడ్‌సేఫ్టీ పోలీసులు రసూల్, సిబ్బంది వాహనదారులకు పలు సూచనలు చేశారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దుతున్నారు.

రైతు ఆత్మహత్య

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురానికి చెందిన కల్లె శ్రీనివాసులు(62) ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతుండేవాడని, దీనికి తోడు అప్పులు ఉండటంతో ఆవేదన చెందేవాడని ఆయన కుమారుడు మధు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండ్రోజుల క్రితం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడని చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


మృతి చెందిన సుమలత

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామలో ఓ వివాహిత బుధవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో ఇంట్లోనే మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. శిరివెళ్ల మండలం కొటపాడు గ్రామానికి చెందిన సుమలత(26)ను 9 ఏళ్ల క్రితం రామచంద్రాపురం గ్రామానికి చెందిన జోసఫ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి క్రాంతి, క్రాంతిక, కీర్తి సంతానం. కాగా కొన్నేళ్ల నుంచి భార్యను అనుమానంతో వేధించేవాడని సుమలత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వేధింపులకు తట్టుకోలేక గత ఏడాది పురుగు మందు తాగి అత్మహ్యకు ప్రయత్నించినట్లు బంధువులు చెబుతున్నారు. మంగళవారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. అయితే పొద్దున్నే ఇంట్లో విగతజీవిగా పడివున్న సుమలతను స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. రాత్రి గొడవ పడ్డామని, ఉదయమే పని నిమిత్తం తాను ఇంట్లో నుంచి ఆళ్లగడ్డకు రాగా తన భార్య ఎలా మృతిచెందిందో తెలియడం లేదని భర్త పేర్కొంటుండగా.. భర్తే గొంతు నులిమి చంపేసి ఉంటాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సీఐ హనుమంతునాయక్ మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యుల నుంచా వివరాలు సేకరించారు. మృతురాలి సోదరి విజయమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నివేదికలో పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.

పెద్దాసుపత్రిలో అధ్వానంగా మరుగుదొడ్లు


తలుపులు ఊడిపోయి అపరిశుభ్రంగా ఉన్న బాత్‌రూమ్‌లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులు వెళ్లే బాత్‌రూమ్‌లు అధ్వానంగా ఉన్నాయి. ఆసుపత్రిలోని ప్రతి విభాగంలో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా శుశృత భవన్ (బూత్ బంగ్లా) మొదటి అంతస్తులో ఉన్న ఎంఎస్-5 విభాగంలో పరిస్థితి వర్ణనాతీతం. ఇక్కడ పడకల కొరత కూడా తీవ్రంగా ఉంది. ఒకే పడకపై ఇద్దరేసి రోగులు చికిత్స పొందుతున్నారు. దీంతో పాటు ఒకే బాత్‌రూమ్‌లోకి స్త్రీ, పురుషులు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల రోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. బాత్‌రూమ్‌ల వద్ద శుభ్రత లేకపోవడం, బాత్‌రూమ్‌లోని కమోడ్, బేసిన్‌లు పగిలిపోయి, పాచిపట్టి ఉండటంతో రోగులు వెళ్లేందుకు జంకుతున్నారు. ఈ సమస్యను బుధవారం సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు కె.సుధాకరప్ప, నగర కమిటీ సభ్యులు జి.ఏసు పరిశీలించారు. స్త్రీ, పురుషులు కలిసి ఒకే మరుగుదొడ్డిలోకి వెళ్తున్నారని, వాకిళ్లు కూడా సరిగ్గా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే పడకపై ఇద్దరేసి రోగులకు సెలైన్ ఎక్కిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు ఆసుపత్రి అభివృద్ధిపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన

- జిల్లాకు చేరుకున్న బృంద సభ్యులు
- జల్‌శక్తి అభియాన్ పనుల పరిశీలన

కర్నూలు(అగ్రికల్చర్): జల్‌శక్తి అభియాన్ కింద జరుగుతున్న జలసంరక్షణ, భూగర్భ జలాల అభివృద్ధిని పరిశీలించేందుకు కేంద్ర బృంద సభ్యులు బుధవారం మధ్యాహ్ననికే కర్నూలు చేరుకున్నారు. వీరు ఈ నెల 18 నుంచి 20 వరకు జిల్లాలో పర్యటించనున్నారు. కేంద్ర బృందానికి నోడల్ అధికారిగా ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ కమిషనర్ చిత్తరంజన్‌దాస్, టెక్నికల్ ఆఫీసర్‌గా సీ.టెక్ సైంటిస్ట్ బిజయ్‌కేతన్ మోహితా వ్యవహరిస్తారు. కర్నూలుకు వచ్చిన వీరు హోటల్ త్రిగుణలో బస చేశారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి, నీటిపారుదల శాఖ ఎస్ఇ రెడ్డి శేఖర్ తదితరులతో సమావేశమై.. జల్‌శక్తి అభియాన్ పనులపై ఆరా తీశారు.

పర్యటన ఇలా...

కేంద్ర బృంద సభ్యులు గురువారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. మొదటి రోజు సుంకేసుల బ్యారేజీని సందర్శిస్తారు. అలాగే కర్నూలు మండలం మునగాలపాడు గ్రామంలోని ఎస్ఎస్ ట్యాంకు, వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంటును పరిశీలిస్తారు. అనంతరం గార్గేయపురం ఎంఐ ట్యాంకు, నగరవనం, దేవనగర్‌లోని అమృత్ స్కీమ్ కింద సేవేజ్ ట్రీట్‌మెంటు ప్లాంటును సందర్శిస్తారు. సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్‌లో జలశక్తి అభియాన్‌కు సంబంధించి లైన్ డిపార్టుమెంటు అధికారులతో జరిగే సమావేశం పాల్గొంటారు. 19న గోనెగండ్ల, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాల్లో జరిగిన జల్‌శక్తి అభియాన్ పనులను పరిశీలిస్తారు. 20న కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో జలసంరక్షణ, భూగర్భ జలాల అభివృద్ధిని ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విధి విధానాలను వివరిస్తారు.

వ్యక్తి దారుణహత్య

కర్నూలు: కర్నూలులో రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో జలమండలి కార్యాలయం ఎదురుగా ఉన్న అడిషనల్ ఎస్పీ పాత బంగ్లా వద్ద డోన్ పట్టణానికి చెందిన శ్రీరాములు (45) దారుణ హత్యకు గురయ్యాడు. అతడు కొంతకాలంగా కర్నూలులోని వివిధ కాలనీల్లో చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ సామగ్రి ఏరుకుంటూ జీవనం సాగించేవాడు. మంగళవారం పగలంతా ప్లాస్టిక్ సామాన్లను ఏరుకుని రాత్రి అడిషనల్ ఎస్పీ పాత బంగ్లా సమీపంలోని ఫుట్‌పాత్‌పై పడుకున్నాడు. అలాగే ఫాతిమా, మద్దమ్మ అనే మహిళలు చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించేవారు. వారు రాత్రి ఫుట్‌పాత్‌పై నిద్రించే ముందు గొడవ పడుతుండగా శ్రీరాములు మద్దమ్మపై చేయి చేసుకున్నాడు. సమీపంలోనే నిద్రిస్తున్న పరశురాం అనే వ్యక్తి వారిని వారించేందుకు వెళ్లి శ్రీరాములును రాయితో బాదడంతో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రెండవ పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రత్యక్ష సాక్షి మద్దమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీరాములుకు ఫాతిమాతో, పరశురాంకు మద్దమ్మతో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలో విచారణ చేస్తున్నారు.

జేబు దొంగల అరెస్ట్

కర్నూలు: కర్నూలు కొత్తబస్టాండ్‌ను అడ్డాగా చేసుకుని ఆటోల్లో సంచరిస్తూ చేతివాటం ప్రదర్శించి సెల్‌ఫోన్లు, పర్సులు, వస్తువులు, గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న పది మంది పాత నేరస్తులను నాల్గవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పత్తికొండకు చెందిన మునలప్ప తన కుమారుడిని స్థానిక జీఎస్ఆర్ హాస్పిటల్‌లో చేర్పించేందుకు ఈనెల 15వ తేదీన కర్నూలుకు వచ్చాడు. ఆసుపత్రి వద్దకు ఆటోలో వెళ్తుండగా జేబు దొంగల ముఠా నాయకుడు పందిపాడు వాసి జుబేర్ ఆటోలో ఎక్కి రూ.27 వేలు నొక్కేసి మార్గమధ్యలో దిగేసి వెళ్లిపోయాడు. మునలప్ప ఆసుపత్రి వద్దకు వెళ్లిన తర్వాత చూసుకుని డబ్బులు కనిపించకపోవడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పక్కా ఆధారాలతో జుబేర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. చోరీ చేసిన రూ.27 వేలు నగదును రికవరీ చేసి బాధితుడు మునలప్పకు అప్పగించి జుబేర్‌ను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. అలాగే కొంతకాలంగా ఆటో ప్రయాణికుల వలే సంచరిస్తూ జేబు దొంగతనాలకు పాల్పడుతున్న పందిపాడు, కొత్తపేట, బుధవారపేటకు చెందిన తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని బైండోవర్ చేసినట్లు నాల్గవ పట్టణ ఎస్ఐ మోహన్‌కిషోర్ రెడ్డి తెలిపారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి

కర్నూలు: భర్త, అత్తామామలు వేధించడంతో బాపూజీనగర్‌లో నివాసముంటున్న శేఖర్ భార్య మేదరి సామిదేవి (26) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. గద్వాల జిల్లా తక్కశిలకు చెందిన సామిదేవిని కర్నూలుకు చెందిన శేఖర్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొంత నగదు, బంగారు నగలు కట్నంగా ఇచ్చారు. శేఖర్ ఓ దుకాణంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా అదనపు కట్నం తీసుకు రావాలని వేధింపులకు గురిచేసేవాడు. దీంతో విరక్తి చెందిన సామిదేవి మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుంది. కుటుంబసభ్యులు గుర్తించి తలుపు బద్దలుకొట్టి ఉరి నుంచి తప్పించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై భర్త శేఖర్‌తో పాటు అతని తల్లిదండ్రులు అమ్మక్క, సామన్న అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతోనే తన కుమార్తె ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తల్లి సూర్యకాంతం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు.

అగ్నిగుండంలో పడి వ్యక్తి తీవ్ర గాయాలు

ఆదోని అర్బన్: హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామంలో మొహర్రం అపశ్రుతి చోటుచేసుకుంది. బుధవారం పీర్లదేవుళ్ల సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అగ్నిగుండం వద్ద తోపులాట జరగగా గ్రామానికి చెందిన పీర్‌సాబ్ అందులో పడగా తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బంధువులు అతడిని ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

■ కర్నూలు గాయత్రి ఎస్టేట్ విజయ దయాగ్నోస్టిక్ సెంటర్ ప్రక్కన, శ్రీ గురు రాఘవేంద్ర డెంటల్ & పాలీక్లినిక్ పైన, 1వ ఫ్లోర్, 291/2x20 సైజు రూం అద్దెకు కలదు. (అటాచ్డ్ బాత్‌రూం, లిఫ్ట్ కలదు) క్లినిక్స్‌కు, ఆఫీసులకు అనుకూలం. 94903 78794 [L-796496]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6521]

WANTED

■ దూపాడు ఔటర్‌రింగ్ రోడ్డు సమీపాన ప్రముఖ వెంచర్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 గం॥ డ్యూటీ, 10 వేలు జీతం. సంప్ర: 91829 64173 [L-794211]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. మంచి జీతం+ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. సం.ప్ర: 9502872639. [L-794205]

■ కష్టమైన్నే కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD. ఫోన్: 7995984445 [HA-390]

■ డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు, ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొని కొవ్వొత్తులు, పెన్సిల్స్ తయారు చేసి మాకు ఇవ్వండి, గ్రూప్‌లకు ఉచిత శిక్షణ. ఫోన్: 9491995565 [H-796133]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14404]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

‘కుష్టు’ నివారణే లక్ష్యంగా..

- నేటి నుంచి ఆగస్టు 2 వరకు ఇంటింటి సర్వే
- బాధితుల గుర్తించి సత్వరే చికిత్స
- వైకల్యం రాకుండా చర్యలు
- చిన్నపిల్లల్లో బాధితుల గుర్తింపు
- ఈ ఏడాది ఇప్పటి వరకు 147 కేసుల నమోదు



ఇంటింటి సర్వేలో ప్రజలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది, ఇంటింటి సర్వే కార్యక్రమం కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

గత ఆరేళ్లలో కుష్టువ్యాధిగ్రస్తుల సంఖ్య	
సంవత్సరం	బయటపడిన కేసులు
2018-19	304
2019-20	342
2020-21	92
2021-22	137
2022-23	167
2023-24	201
2024-25	147

(ఇప్పటివరకు)

కర్నూలు(హాస్పిటల్): ఇప్పటికీ చాలా మందికి కుష్టు వ్యాధిగ్రస్తులంటే అదోరకమైన భయం. వారికి వచ్చిన వ్యాధి మనకూ అంటుకుంటుందన్న ఆందోళన. దీంతో ఈ వ్యాధిగ్రస్తులు కనిపిస్తే చాలు అలా దూరం జరుగుతుంటారు. వారికి దూరంగా ఉండి వ్యవహరిస్తారు. అయితే గతంతో పోలిస్తే ప్రజల్లో ఈ వ్యాధిపై అవగాహన పెరగడంతో వారు ప్రజల్లో కలిసిపోతున్నారు. అందరితో పాటు కలిసి జీవిస్తున్నారు. ఒకప్పుడు ఈ వ్యాధి అంతమైపోయిందని అంతా భావించారు. కానీ గత కొన్నేళ్లుగా మళ్లీ ఈ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నారు. ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తున్న ఈ సర్వేలో ప్రతిసారీ కొత్త వ్యాధిగ్రస్తులు బయటపడుతున్నారు.

సర్వేకు సిద్ధంగా వైద్య బృందాలు

జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18వ తేది నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇందుకు వైద్య బృందాలు సిద్ధంగా ఉన్నాయి. గతంలో ప్రతి బృందంలో ఒక ఆశ, సచివాలయ వలంటీర్లు ఉండేవారు. ఇప్పుడు వలంటీర్ల స్థానంలో ఎవ్వరూ లేరు. వారి స్థానంలో స్థానికులను ఎవ్వరినైనా సహాయం అడగాలని ప్రభుత్వం సూచించింది. కానీ ఇప్పటి వరకు ఎవరూ ముందుకు రాలేదని సమాచారం. కాగా ప్రస్తుతం వీరు జిల్లాలోని 24,26,723 జనాభాలోని 6,43,648 ఇళ్లను తిరిగి ప్రతి ఒక్కరినీ పలకరించి, కుష్టు వ్యాధి లక్షణాలు ఏమైనా ఉన్నాయేమోనని పరిశీలించాల్సి ఉంది. అనుమానిత లక్షణాలున్న వారిని సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యులచే పరీక్ష చేయించాలి. వ్యాధినిర్ధారణ అయితే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కుష్టువ్యాధి విభాగం లేదా చర్మవ్యాధుల విభాగానికి పంపించి చికిత్స చేయించాలి.

వ్యాధి లక్షణాలు ఇవీ..

- చర్మంపై స్పర్శలేని రాగి రంగు గల మచ్చలు
- చెవులపై బుడిపెలు, కణితులు, నరాల తిమ్మిర్లు
- మందమైన మెరిసే జిడ్డుగల చర్మం(చర్మం ఉబ్బెత్తుగా బత్తాయి తొక్కలాగా ఉండటం), చెవులపై బొడిపెలు
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం
- కనురెప్పలు మూతపడకపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం
- చర్మం ఉబ్బెత్తుగా బత్తాయి తొక్కలాగా ఉండటం, చెవులపై బొడిపెలు రావడం
- తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం
- చేతివేళ్లు, కాలివేళ్లు వంకర్లు తిరిగి అంగ వైకల్యం రావడం
- కాళ్లు, చేతులు తిమ్మిర్లు లేక జోములు కలిగి ఉండటం
- కాళ్లకు చెప్పులు జారిపోవడం
- చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- పాదాలు(మడిమలు) వాపు ఉండటం

పై లక్షణాలు ఉన్న వారిని సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తే వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు.

ఇంట్లో వారికి కుష్టు చికిత్స

కుష్టు వ్యాధి కేసు బయటపడిన చుట్టుపక్కల 300 ఇళ్లల్లో వైద్యబృందం స్క్రీనింగ్ నిర్వహిస్తారు. కేసు బయటపడిన ఇంటిలోని వారందరికీ కుష్టులేకపోయినా ముందుజాగ్రత్తగా మందులు ఇస్తారు. కుష్టు వ్యాధిగ్రస్తునికి మాత్రం ఒంట్లో పాసిప్ బేసిల్‌లై(తక్కువస్థాయిలో లెప్రసి క్రిములు) ఉంటే 6 నెలలు, మల్టీ బేసిల్‌లై(అధిక శాతం లెప్రసి క్రిములు) ఉంటే 9 నెలల పాటు మల్టీ డ్రగ్ థెరపి(ఎండీటీ) మందులను ఉచితంగా అందజేస్తారు.

నేటి నుంచి సర్వే

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు గాను ఈ నెల 18వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేది వరకు సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసి అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ చెప్పారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత సంవత్సరం చివరల్లో నిర్వహించిన సర్వేలో 40 కొత్త కేసులు గుర్తించినట్లు తెలిపారు. దాగి ఉన్న కేసులను గుర్తించడం, వ్యాధి వ్యాప్తిని అరికట్టడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ వ్యాధివల్ల ఎవ్వరూ అంగవైకల్యానికి గురిగాకూడదని, చిన్నపిల్లల్లోనూ ఈ కేసులు రాకూడదని తెలిపారు. ముందుగా గుర్తిస్తేనే ఇది సాధ్యమవుతుందని, అందుకే ఇంటింటి సర్వే చేపట్టామని తెలిపారు. జిల్లాలో ఈ వ్యాధి ప్రస్తుతం అదుపులోనే ఉందని చెప్పారు. సాధారణంగా 10వేల మందిలో ఒకటిలోపు ఉండాలని, కానీ జిల్లాలో 0.59గా ఉందన్నారు. అలాగే సంవత్సరంలో 10లోపు కొత్త కేసులు రావాలని, కానీ జిల్లాలో 5.91 కొత్త కేసులు మాత్రమే బయటపడుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 147 మంది ఈ వ్యాధితో చికిత్స పొందుతున్నారని, గత ఏప్రిల్, మే, జూన్‌లలో ఇందులో 89 మంది చికిత్స పూర్తయ్యిందని తెలిపారు. సమావేశంలో టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.